క్లుప్తంగా

మదనపల్లెలో 70.4 మి.మీ. వర్షపాతం

మదనపల్లె : మదనపల్లె మండలంలో మంగళవారం వేకువజామున కుండపోత వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన శబ్దాలతో తెల్లవారుజామున ఏకధాటిగా వర్షం కురవడం జరిగింది. మదనపల్లె డివిజన్‌లో వర్షపాతం నమోదు వివరాలను పరిశీలిస్తే...మదనపల్లెలో 70.4 మి.మీ. అత్యధిక వర్షపాతం నమోదుకాగా, వాల్మీకిపురం మండలంలో 1.2 మి.మీ. అత్యల్పంగా నమోదైంది. నిమ్మనపల్లెలో 6మి.మీ., కురబలకోట 12.మి.మీ., బి.కొత్తకోట 18.4, తంబళ్లపల్లె 22.2, పీటీఎం 18 మి.మీ., ములకలచెరువు 41మి.మీ. పెద్దమండ్యం 15మి.మీ. వర్షపాతం కురిసింది. కలికిరి, రామసముద్రం మండలాల్లో వర్షం కురవలేదు.

సదరం క్యాంపు పునఃప్రారంభం

తంబళ్లపల్లె : స్థానిక వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో మంగళవారం వైకల్య నిర్ధారణకు నిర్వహించే సదరన్ క్యాంప్‌ను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరామయ్య ప్రారంభించారు. ఇంతకు ముందు ఆర్థోపెడిక్ డాక్టర్ భరత్‌ను వైఎస్సార్ జిల్లా బద్వేలుకు బదిలీ చేశారు. దీంతో క్యాంపు నిలిచిపోయింది. ఆ స్థానంలో ఉన్నతాధికారులు మదనపల్లె జిల్లా ఆస్పత్రి నుంచి డాక్టర్ జ్ఞానేశ్వర్‌ను నియమించారు. క్యాంప్‌లో వైద్యులు 20 మందికి వైకల్య నిర్ధారణ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ల్యాబ్‌టెక్నీషియన్ బాలాజీ, గోవర్ధన్ పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె : తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో నిర్వహించిన ఇంటర్ కాలేజియేట్ తైక్వాండో పోటీల్లో పట్టణంలోని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచి పతకాలు సాధించినట్లు కరస్పాండెంట్ డాక్టర్.ఆర్.గురుప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కళాశాలలో మొదటిసంవత్సరం బీబీఏ చదువుతున్న పి.విష్ణువర్ధన్ 74కిలోల విభాగంలో, హయతుల్లా అమీన్ 54 కిలోల విభాగంలో రెండోస్థానంలో నిలిచి సిల్వర్ మెడల్స్ సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ సురభిరమాదేవి, పీడీ శరత్ అభినందించారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో ..

కలకడ : మండలంలోని కోన ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి అండర్-17 విభాగంలో గోల్డ్‌మెడల్‌తో పాటు, కప్‌ను కైవసం చేసుకున్నట్లు హెచ్‌ఎం చంగల్‌రాయుడు మంగళవారం తెలిపారు. రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో చిత్తూరు జిల్లా టీం విజయం సాధించిందని తెలపారు. విజేత జట్టులో కోన ఉన్నత పాఠశాలకు చెందిన సమీర్‌ఖాన్, గణేష్‌రాయల్, షారుక్‌ఖాన్, యోగేష్, మునికిరణ్, జితేంద్ర, శివతేజలు పాల్గొని గోల్డ్‌మెడల్ అందించినట్లు తెలిపారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ ఝాన్సిరాణిని సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేశ్వరి, నాగమునినాయక్, రమేష్‌కుమార్‌రెడ్డి, షౌకత్‌అల్లీ, గఫార్‌ఖాన్, నౌషాద్‌బేగం, సైరాబాను, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

నిమ్మనపల్లె : విద్యార్థులు తప్పనిసరిగా ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ అన్నారు. మంగళవారం కళాశాలలో ఆధార్ ఉచిత క్యాంప్‌ను ప్రారంభించారు. ఆధార్ ప్రత్యేక క్యాంపులను 22 నుంచి అక్టోబర్ 25 తేదీ వరకు నిర్వహిస్తున్నారన్నారు. ఆధార్ నమోదు, మార్పులు చేర్పులు, ఐదు సంవత్సరములు, 15 సంవత్సరాలు పూర్తయిన విద్యార్థుల బయోమెట్రిక్ అప్‌డేట్ చేయడం జరుగుతుందన్నారు. పాఠశాలలు సంబంధిత సచివాలయాల్లో నిర్వహించే ఆధార్ క్యాంపులను విద్యార్థులు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 24 మంది విద్యార్థులు బయోమెట్రిక్ ఆధార్ అప్డేట్ చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాధాకృష్ణ, నిమ్మనపల్లె సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రెడ్డి అహమ్మద్, డిజిటల్ అసిస్టెంట్ ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

46 మంది జాబ్‌మేళాలో ఎంపిక

పీలేరు రూరల్ : జాబ్‌మేళాలో 46 మంది యువత ఎంపికైనట్లు సంజయ్‌గాంధి ప్రభుత్వ డిగ్రీకలాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యం.సుధాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళకు 85మంది హాజరు అయ్యారు. జాబ్‌మేళాలో ఉద్యోగాలు పొందిన యువతను అభినందించారు. కార్యక్రమంలో ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దొనప్ప, సిల్క్ డెవలప్‌మెంట్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్, కోఆర్డినేటర్ హరీష్ పాల్గొన్నారు.

వ్యాధిరహిత సమాజం కోసం కృషి చేద్దాం

పీలేరు : వ్యాధిరహిత సమాజం కోసం కృషి చేద్దామని తలపుల పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని ముదుపులవేముల పంచాయతీ కుమ్మరపల్లె లో పారామెడికల్ సిబ్బందితో కలిసి ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు, మందులు అందజేశారు. అధిక వర్షాలు-ఆరోగ్య నియమాలు అంశంపై అవగాహన కల్పించారు. వ్యాధులు లేని సమాజం సమాజానికి ఎంతో అవసరమని, 28 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు, రక్తపోటు, డయాబెటిక్ మొదలు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు క్రిష్ణయ్య, ఏఎన్‌యంలు వసుందర, నాగముత్యం, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

గిట్టుబాటుకాని ఉపాధి

- ముందుకు సాగని ఉపాధిహామీ పనులు
- వ్యవసాయపనులపైనే ఆసక్తి
- ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టులు ఖాళీనే..

మండలంలో జాబ్‌కార్డులు, కూలీల వివరాలు

మండలంలో మొత్తం కూలీలు	: 11764
మొత్తం జాబ్‌కార్డుల సంఖ్య	: 6480
ప్రస్తుతం పనులు చేస్తున్న కూలీల సంఖ్య	: 290
మండలంలో జరుగుతున్న పనులు	: 34
ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టుల సంఖ్య	: 05



కొత్తపల్లెలో ఉపాధి పనులకు వచ్చిన నలుగురు కూలీలు

గుర్రంకొండ : వ్యవసాయపనుల ఏఫెక్ట్‌తో ఉపాధి హామీ పనులు ముందుకు సాగడంలేదు. ఉపాధిహామీపనుల్లో ఎంత కష్టపడినా రూ.300 లోపే కూలి రేట్లు గిట్టుబాటు అవుతున్నాయి. ఇదే సమయంలో వ్యవసాయపనులు కూలీలకు కాసులు కురిపిస్తున్నాయి. దీంతో ఉపాధిహామీ కూలీలు వ్యవసాయపనులుపై ఆసక్తి చూపిస్తున్నారు.

ముందుకు సాగని ఉపాధిహామీ పనులు

మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధిహామీ పనులు ముందుకు సాగడం లేదు. మండలం మొత్తం మీద 15 గ్రామ పంచాయతీలకుగానూ 34 పనులు మాత్రమే చేపడుతుండటం గమనార్హం. సగటున ఒక్కో పంచాయతీకి రెండు పనులు జరుగుతున్నాయి. మండలంలో 11,764 మంది ఉపాధి హామీ పనులు చేసే కూలీలు ఉండగా ప్రస్తుతం 290 మంది మాత్రమే పనులు చేస్తున్నారు. కేవలం 2.5 శాతం మాత్రమే ఉపాధిహామీ పనులు చేస్తుండడం గమనార్హం.

గిట్టుబాటుకాని కూలిరేట్లు

ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు ఎంత కష్టపడినా రోజుకు మిగిలేది రూ. 300లోపే ఉంటోంది. దీనికి తోడు భూమి మెత్తగా లేకపోతే పనులు అసలు ముందుకు సాగని పరిస్థితి ఉంటుంది. పండ్లతోటల పెంపకం, రింగ్‌ట్రెంచ్‌లు, సప్లయ్ ఛానల్స్, ఫాంపాండ్ వంటి పనులు ప్రస్తుతం ఉపాధిహామీలో జరుగుతున్నాయి. అన్ని మట్టి తవ్వే పనులే కావడంతో సదరు పనులు చేసే ప్రాంతంలో భూమి మెత్తగా ఉంటే తొందరగా పనులు జరుగుతాయి. లేని పక్షంలో రోజంతా కష్టపడినా కూలి రేట్లు రూ.100 కంటే గిట్టుబాటు కావు. దీనికితోడు పనులు చేసినా రోజుల తరబడి బిల్లుల కోసం వేసి చూడాల్సిన పరిస్థితి. పలు గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేయించే ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సదరు గ్రామాల్లో మేట్లే ఉపాధిహామీ పనులు చేయించాల్సిన పరిస్థితి నెలకొంది.

వ్యవసాయపనులే బెస్ట్..

ప్రస్తుత పరిస్థితిలో ఉపాధిహామీ పనుల కంటే వ్యవసాయపనులే మేలని కూలీలు అంటున్నారు. ఉదయం ఏడుగంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే ఆరుగంటల పాటు కూలీలు పొలాల్లో పనిచేస్తారు. ఇందుకుగానూ మహిళలకు రూ. 350, పురుషులకు రూ. 500 వరకు కూలి గిట్టుబాటు అవుతున్నాయి. అదే రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంకాలం 6 గంటల వరకు పనిచేస్తే మహిళలకు అయితే రూ.450 నుంచి రూ.500, పురుషులకు రూ.650 వరకు కూలి గిట్టుబాటు అవుతుంది. పనులకెళ్లాలంటే పనులు చేయించుకొనే రైతులు కూలీలకు ఆటోలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీంతో ఇంటి దగ్గర బయలుదేరినప్పటి నుంచి మళ్లీ ఇంటికి వచ్చే వరకు ఆటో సౌకర్యం ఉంటుంది. మధ్యలో రైతులు కూలీలకు తాంబుళం, కూల్‌డ్రింక్స్‌తో స్నాక్స్ అందిస్తుంటారు. కూలి డబ్బులు కూడా పనులు చేసిన వెంటనే చెల్లిస్తుంటారు. దీంతో కూలీలు ఎక్కువగా వ్యవసాయపనుల వైపు మొగ్గు చూపుతున్నారు.

కూలిరేట్లు గిట్టుబాటు కావడంలేదు



ఉపాధిహామీ పనులు చేయడం వలన కూలలి రేట్లు గిట్టుబాటు కావడం లేదు. రోజంగా కష్టపడినా రూ.300 లోపే వస్తోంది. అదే వ్యవసాయపనులకు వెళ్తే రోజుకు రూ.350 నుంచి రూ.500 వరకు గిట్టుబాటు అవుతుంది. ఉపాధి హామీ పనులకు వెళితే కూలి డబ్బుల కోసం రోజుల తరబడి వేచి చూడాలి.
– రమణమ్మ, మొరంపల్లె

వ్యవసాయ పనులపై ఆసక్తి



ప్రస్తుతం గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలు వ్యవసాయ పనుల వైపు మొగ్గుచూపుతున్నారు. ఉపాధి హామీ పనుల్లో కంటే వారికి వ్యవసాయపనుల్లో మంచి కూలి డబ్బులు వస్తున్నాయని కూలీలు అంటున్నారు. ఉపాధి పనుల్లో కూడా కూలీ డబ్బులు త్వరగానే చెల్లిస్తున్నాం. అయినా కూలీలు పనులకు రావడం లేదు.
– జయరామిరెడ్డి, ఏపీఓ, గుర్రంకొండ

రైతులు లాభపడేందుకే రైతుబజార్

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



రైతుబజార్ ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : మధ్యవర్తులు, దళారుల బెడద లేకుండా పండించిన ఉత్పత్తులను గిట్టుబాటు ధరకు అమ్ముకుని, రైతులందరూ లాభపడాలనే ఉద్దేశంతో పట్టణంలో రైతుబజార్‌ను ప్రారంభిస్తున్నామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మంగళవారం సంతగేటు సమీపంలోని రైతుబజార్‌ను, మార్కెటింగ్‌శాఖ ఏడీ త్యాగరాజుతో కలిసి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పరిశీలించారు. ఆధునికీకరణలో భాగంగా స్టాళ్లను ఆకట్టుకునేలా, అందంగా తీర్చిదిద్దడంపై మార్కెటింగ్ అధికారులను అభినందించారు. రైతుబజార్‌లో ఎన్ని స్టాళ్లను ఏర్పాటు చేశారు? ఏ ప్రాతిపదికన కేటాయిస్తున్నారు? ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? అంటూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ...పట్టణ ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన తాజా కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, పాలు, గుడ్లు, మాంసం, చేపలు తదితర నిత్యావసరాలన్నింటినీ ఒకేచోట అందుబాటులోకి తెచ్చేందుకు రైతుబజార్‌ను తిరిగి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రైతుబజార్‌లో ఉత్పత్తులు విక్రయించుకునే రైతుల నుంచి ఎలాంటి ఫీజులు, గేటు వసూలుచేయడం జరగదన్నారు. స్టాల్స్‌లో వ్యాపారాలు నిర్వహించాలనుకున్న వ్యాపారులకు రూ.50వేలు అడ్వాన్సు, రూ.4వేల అద్దెతో గదులు కేటాయిస్తామన్నారు. అలాగే పట్టణంలో మున్సిపల్ పరిధిలో తలపై బుట్టలు పెట్టుకుని, రోడ్లపై చిన్న చిన్న గంపలు పెట్టుకుని, కష్టార్జితంతో బతికే చిరువ్యాపారుల నుంచి ఎలాంటి గేటు వసూళ్లు చేయవద్దన్నారు. మున్సిపాలిటీలో దినసరిగేటు వసూళ్ల టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్‌పై ఫిర్యాదులు అధికంగా ఉండటంతో డిస్ క్వాలిఫై చేయాల్సిందిగా మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, టీడీపీ మైనారిటీ నాయకులు ఎస్.ఏ.మస్తాన్, కురవంక మోహన్, శ్రీరామవినోద్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ నిర్మాణాలు వేగవంతం చేయాలి



హౌసింగ్ సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీడీఓ భానుమూర్తి

కలికిరి : నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టేలా ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు కృషి చేయాలని ఎంపీడీఓ భానుమూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం హౌసింగ్ ఏఈ, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో హౌసింగ్ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడిని సిబ్బంది కలిసి నిర్మాణాలు చేపట్టేలా అవగాహన కల్పించాలన్నారు. నిర్మాణాలు డిసెంబరు ఆఖరుకు పూర్తి చేసేలా చూడాలన్నారు. ఈ మేరకు సిబ్బంది క్షేత్ర స్థాయిలో చర్యలు చేపట్టాలన్నారు. హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పరిశీలన

పెద్దమండ్యం : పక్కాగృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని డీఈ వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని కలిచెర్ల, ఎన్‌పోపల్లె గ్రామాలలో మంగళవారం పక్కాగృహాల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పక్కాగృహాల లబ్ధిదారులతో బిల్లుల గురించి అడిగి తెలుసుకొన్నారు. పనులు పూర్తి కాగానే సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నట్లు డీఈ తెలిపారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బందితో కలిసి పంచాయతీల వారీగా పక్కాగృహాల నిర్మాణాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఏఈ అక్రమ్, సిబ్బంది మల్లికార్జున పాల్గొన్నారు.

డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేయాలి

తంబళ్లపల్లె : మండలంలో డిసెంబర్‌నెలాఖరుకు అసంపూర్తిగా ఉన్న పక్కా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని స్పెషల్ ఆఫీసర్, డీఎల్‌పీఓ నాగరాజు హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలు, జరుగుతున్న స్థాయి తదితర అంశాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆరా తీశారు. లబ్ధిదారులను చైతన్యపరిచి త్వరగా పనులు చేపట్టే విధంగా చొరవ చూపాలన్నారు. ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి, ఈఓపీఆర్డీ దిలీప్ కుమార్, ఎఈలు సుజాత, హరిలు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను తరిమివేద్దాం.. యువతను కాపాడుదాం



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్‌ఐ జబీవుల్లా

మదనపల్లె సిటీ : డ్రగ్స్‌ను తరిమివేద్దాం.. యువతను కాపాడుదామని గ్రామ జ్యోతి సొసైటీ అధ్యక్షురాలు సుభద్ర అన్నారు. మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. డ్రగ్స్,మాదక ద్రవ్యాల బారిన పడకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా యువతను కాపాడుకోవాలన్నారు. కొంత మంది మాదకద్రవ్యాలను దిగుమతి చేసుకుని కాలేజీ యువతి,యువకులను లక్ష్యంగా చేసుకుని వారిని మత్తు పదార్థాలకు బానిసలు చేస్తున్నారన్నారు. మాదకద్రవ్యాలు గురించి ఎటువంటి సమాచారం తెలిసినా పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనవుతూ మంచి భవిష్యత్తు కోల్పోతున్నారాన్నరు. విద్యార్థులు చెడు అలవాట్లకి దూరంగా ఉంటూ మంచి స్థాయికి చేరుకుని తల్లిదండ్రులని బాగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్.ఐ జబీవుల్లా, చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, డీన్ భాస్కరన్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి అరుణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైవే స్థలంలో ప్రైవేట్ ఫెన్సింగ్

- పట్టించుకోని రెవెన్యూ, హైవే అధికారులు
- ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం



హైవే స్థలంలో ఏర్పాటు చేసిన కంచె

మదనపల్లె : మండలంలోని వలసపల్లె పంచాయతీ 150వ మైలుకు సమీపంలో ఎన్‌హెచ్-42కు సంబంధించిన హైవే స్థలంలో కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఫెన్సింగ్ వేసుకుని ఆక్రమణకు పాల్పడిన ఘటన మంగళవారం వెలుగుచూసింది. అనంతపురం-కృష్ణగిరి జాతీయరహదారిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో ఏకంగా రాతికూసాలు నాటి కంచె వేయడంపై 150వ మైలు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఇదే స్థలంలో ఓ వ్యక్తి నిద్ర మత్తులో కారు వేగంగా నడుపుకుంటూ వచ్చి చెరువులో పడి మృతిచెందడం జరిగిందని, ప్రస్తుతం దానికి ఆనుకుని కంచె ఏర్పాటుచేస్తుండటం, సమీపంలో మలుపు ఉండటంతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని చెప్పుకొచ్చారు. హైవే స్థలాన్ని ఆక్రమించి ఫెన్సింగ్ వేసినప్పటికీ, రెవెన్యూ, హైవే అధికారులు పట్టించుకోలేదన్నారు.

రైతుల సమస్యలు పట్టవా..?

సర్వసభ్యస మావేశంలో సర్పంచ్ నిలదీత



మాట్లాడుతున్న ఎంపీపీ నూర్జహాన్

కలికిరి : ట్రాన్స్‌కో అధికారులకు రైతుల సమస్యలు పట్టవా అని మండలంలోని గుట్టపాళెం సర్పంచ్ వెంకటరెడ్డి ట్రాన్స్‌కో ఏఈ ముజీబుర్ రెహ్మాన్‌ను నిలదీశారు. మండల పరిషత్ సమావేశ హాలులో ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన ఎంపీడీఓ భానుమూర్తి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ట్రాన్స్‌కో సమీక్షలో భాగంగా గుట్టపాళెం గ్రామంలో గల లోఓల్టేజి సమస్య పరిష్కారానికి గాను కొత్తగా విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణాలు పూర్తి చేసుకున్నా అధికారులు స్పందించక పోవడంతో రైతుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయన్నారు. అధికారులు స్పందించక పోవడం దారుణమని సర్పంచ్ సమావేశం దృష్టికి తీసుకువస్తామన్నారు. త్వరలో ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని ఏఈ అన్నారు. మండల పరిధిలోని రోడ్లు గుంతల మయంగా మారాయని, ఆర్అండ్‌బీబీ ఏఈ పోస్టు ఖాళీగా ఉండటంతో ఎవరికి నివేదించాలని పలువురు సభ్యులు ఎంపీడీఓకు విన్నవించారు. మండలంలో భూ రీసర్వే జరిగిన గ్రామాల్లో విస్తీర్ణముల వ్యత్యాసాలు, పూర్తిగా 1-బి రాక రైతులు అవస్థలు పడుతున్నారని, సమావేశానికి తహసీల్దారు హాజరుకాకపోవడంపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్యాలయ ఎఓ సురేంద్రబాబు, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు టపాసుల దుకాణాలు

సబ్ కలెక్టర్ మేఘస్వరూప్




టపాసుల దుకాణాల ఏర్పాటుపై అధికారులతో చర్చిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : ప్రభుత్వ నిబంధనల ప్రకారమే టపాసుల దుకాణాలు ఏర్పాటు చేయాలని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. మంగళవారం దీపావళి సందర్భంగా తాత్కాలిక టపాసుల విక్రయాలకు సంబంధించి రెవెన్యూ, పోలీసు అధికారులతో కలిసి పట్టణంలోని బీటీ కాలేజ్ గ్రౌండ్స్, మిషన్‌కాంపౌండ్‌ను సబ్ కలెక్టర్ పరిశీలించారు. ప్రజలు వచ్చి, పోయేందుకు, వాహనాలు పార్కింగ్ చేసేందుకు వీలుగా ఎక్కడ ఏర్పాటుచేస్తే బాగుంటుందనే విషయమై తహసీల్దార్ ఖాజాబీ, ఫైర్ ఆఫీసర్ శివయ్య, వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషాలను విచారించారు. మదనపల్లెలో టపాసుల విక్రయాలకు సంబంధించి 34 దుకాణాలకు అనుమతులు ఇచ్చామని, వారిలో కొంతమంది మిషన్‌కాంపౌండ్‌లో ఏర్పాటుచేసుకుంటామని కోరడంతో అంగీకరించారు. మిగిలినవారికి బీటీ కాలేజ్ లేదా టిప్పు సుల్తాన్ గ్రౌండ్స్‌లో ఎక్కడ ఏర్పాటుచేస్తే సౌకర్యంగా ఉంటుందనే విషయమై బుధవారం పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

ట్యాక్సీ బాడుగ బిల్లులు మంజూరు చేయాలి

సబ్ కలెక్టరేట్ ఎదుట యజమానుల నిరసన



నిరసన తెలుపుతున్న ట్యాక్సీ డ్రైవర్, ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

మదనపల్లె : 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో ఎన్నికల విధులకు వినియోగించుకున్న ప్రైవేట్ ట్యాక్సీ వాహనాల అద్దె బకాయిలను మంజూరు చేయాలని డ్రైవర్లు, యజమానులు మంగళవారం సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. నవయుగ కారు డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. వారు మాట్లాడుతూ...ఎన్నికల సమయంలో స్థానిక మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఆదేశాల మేరకు మదనపల్లె నియోజకవర్గానికి 38, తంబళ్లపల్లె నియోజకవర్గానికి 37 వెహికల్స్, 7 కాన్వాయ్ వెహికల్స్‌ను పంపామన్నారు. వీటికి సంబంధించి మదనపల్లె, తంబళ్లపల్లె రిటర్నింగ్ అధికారులకు ఇప్పటికే పలుమార్లు అర్జీలు ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు అద్దెలు చెల్లించలేదని వాపోయారు. కారు బాడుగలను నమ్ముకుని జీవనం సాగిస్తున్న తమకు ఎన్నికలు జరిగి ఐదునెలలు పూర్తవుతున్నప్పటికీ, ఇప్పటివరకు అద్దెలు చెల్లించకపోతే, తమ జీవనం ఎలా సాగాలని ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం వాహనాలకు కలిపి రూ.35 లక్షల 30వేల 230 రూపాయలు రావాల్సి ఉందన్నారు. ఎన్నికల బిల్లులు మంజూరైనట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారని, తక్షణమే బిల్లులు మంజూరుచేసి తమను ఆదుకోవాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సయ్యద్‌సాహెబ్‌వలీ, వెంకటరమణ, డి.ప్రభాకరరెడ్డి, అబ్దుల్‌వహాబ్, బాలసుందరం తదితరులు పాల్గొన్నారు.

పీఎంపీ, ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి చిన్నరెడ్డెప్ప

కలికిరి : మండలంలోని పీఎంపీ, ఆర్‌ఎంపీలు ప్రజలకు ప్రథమ చికిత్సలు మాత్రమే నిర్వహించాలని మండల వైద్యాధికారి చిన్నరెడ్డెప్ప సూచించారు. మండలంలోని మేడికుర్తి పీహెచ్‌సీలో మంగళవారం ఆర్ఎంపీ, పీఎంపీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధుల కాలం కావడంతో ఆర్ఎంపీ, పీఎంపీలు అవగాహన కలిగి ఉండాలన్నారు. జ్వరం బారిన పడిన వారికి రెండు రోజులకు మించి వైద్యం అందించకుండా స్థానిక సీహెచ్‌సీ, పీహెచ్‌సీలకు పంపాలన్నారు. క్షయవ్యాధి అనుమానితులను గుర్తించినట్లయితే వెంటనే ప్రభుత్వాసుపత్రికి పంపడంతో పాటు సమాచారం ఇవ్వాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి ముజీబ్‌బాషా, హెచ్‌ఈ షఫీబుల్లా, పీపీఎం ప్రణీత్, సూపర్వైజర్ నాగిరెడ్డి, డీపీఎస్ సుబ్బయ్య, ఎస్‌టీఎల్ భూపతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

వాల్మీకిపురం : మండలంలోని గండబోయనపల్లి పంచాయతీలో రూ.13 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీఓ మనోహర రాజు తెలిపారు. మంగళవారం మేకలవారిపల్లి, గండబోయనపల్లిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. గ్రామాల్లో సిమెంటు రోడ్లు, మురుగనీటి కాలువలు, తాగునీరు, వీధి దీపాల కోసం నిధులు వెచ్చించడం జరుగుతుందన్నారు. ఈఓపీఆర్‌డీ సుధాకర్ రెడ్డి, విద్యుత్‌శాఖ ఏఈ రాజశేఖర్, సర్పంచ్ గుర్రప్ప, టీడీపీ నాయకులు పులి సత్యనారాయణ రెడ్డి, అమర్నాథరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, చంద్రశేఖర్, రమేష్, గంగిరెడ్డి, కోసూరి చంద్ర, శేషాద్రిరెడ్డి పాల్గొన్నారు.

బదిలీ అధికారులకు సన్మానం

పెద్దతిప్పసముద్రం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్‌గా పని చేస్తున్న పవణ కుమార్, అన్నపూర్ణమ్మ, సాయి గణేష్‌లు వేరే మండలాలకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో సదరు అధికారులకు మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్,ఈవోఆర్డీ యోగానంద్, పలువురు కార్యదర్శులు మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసిన అధికారుల పని తీరు అభినంద నీయమని కొనియాడారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



రామసముద్రం : మండల కేంద్రంలోని దిగువ బస్టాండులో అనాథశవానికి గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు. గత కొన్ని రోజులుగా ఓ వృద్ధుడు అనాథగా బస్టాండులో ఉండేవాడు. ఇతనికి దినసరి మార్కెట్‌లో ఉన్నవారు రోజు భోజనం పెట్టేవారు. అయితే సోమవారం రాత్రి అతడు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయాన్ని స్థానికులు పోలీసులు, పంచాయతీ అధికారులకు తెలియజేయడంతో గ్రామస్థుల సహకారంతో అనాథశవానికి అంత్యక్రియలు నిర్వహించారు.

అంటువ్యాధులు ప్రబలకుండా అవగాహన

పెద్దమండ్యం : వర్షాకాలంలో ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా అవగాహన కల్పించాలిని ఎంపీడీఓ శ్రీధర్‌రావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఇంజినీరింగ్ సహాయకులు, ఆశా వర్కర్‌లతో మంగళవారం పారిశుద్ధ్యం -ప్రజారోగ్యంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రబలే వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డాక్టర్ వివరించారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే లీకేజీలు ఉంటే మరమ్మతులు చేయించాలని సూచించారు. తాగునీటి ట్యాంక్‌లను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయించాలన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సీ డాక్టర్ రవివర్మ, సిహెచ్‌వో క్రిష్ణయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ అశోక్‌కుమార్ లు పాల్గొన్నారు.

సామర్థ్యాల పెంపుతోనే ఉద్యోగ అవకాశాలు



మాట్లాడుతున్న యంగ్ ఇండియా ప్రతినిధి ప్రవల్లిక

తంబళ్లపల్లె : నిరుద్యోగులు తమ సామర్థ్యాలు పెంచుకున్నప్పుడే సులభంగా ఉద్యోగాలు పొందవచ్చునని యంగ్ ఇండియా ప్రతినిధి ప్రవల్లిక తెలిపారు. స్థానిక టీఎన్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. ముత్తూట్ ఫైనాన్స్ ప్రతినిధి సుబ్రమణ్యం హాజరయ్యారు. జాబ్‌మేళాకు 37 మంది హాజరుకాగా 14 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఏపిఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్ చౌడయ్య, టీఏలు నాగరాజు, అశోక్, సురేంద్రలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

పెద్దతిప్పసముద్రం : మండలంలోని అంకిరెడ్డిపల్లి, బూర్లపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ తనిఖీ చేశారు. అనంతరం మామిడి మొక్కల పెంపకం రైతులతో చర్చించారు. ఉపాధి ద్వారా అమలవుతున్న రాయితీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం

– జిల్లా వ్యవసాయాధికారి చంద్రా నాయక్

కురబలకోట : ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం సాధ్యమని జిల్లా వ్యవసాయాధికారి బి. చంద్రా నాయక్ అన్నారు. కురబలకోటలో మంగళవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చన్నారు. ఘన, ద్రవ, జీవామృతం, కషాయాలపై అవగాహన కల్పించారు. ప్రతి రైతు కొంత పొలంలో ప్రకృతి వ్యవసాయం మరి కొంత పొలంలో రసాయనిక ఎరువుల సేద్యం చేయాలన్నారు. రెండింటి మధ్య వ్యత్యాసాన్ని చూడాలన్నారు. తక్కువ పెట్టుబడి కలిగిన ప్రకృతి వ్యవసాయంతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చన్నారు.

శివపార్వతుల కల్యాణోత్సవం

పెద్దతిప్పసముద్రం : ఆశ్వయుజ మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో మంగళవారం శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన వేద పండితులు మురళీ స్వామి, ఖన్నా స్వామి శివపార్వతుల ప్రతిమలకు ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి

కలకడ : రెవెన్యూ గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పనికుమార్ కోరారు. మంగళవారం మండలంలోని కె.బాటవారి పల్లె పంచాయతీ పోతువారిపల్లెలో నిర్వహించిన గ్రామసభలో రెవెన్యూ పరమైన అభ్యంతరాలును రైతుల నుంచి స్వీకరించారు. రికార్డుల మేరకు అధికంగా ఉన్న సర్వేనెంబర్లుకు సంబంధించి ఆరుగురు, ఉమ్మడి ఆస్తిలో భాగపరిష్కారం కాని ఆస్తులకు సంబంధించి-9 మంది ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. భూమికి సంబంధించిన ఆధారాలు పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ దేవి, మండల సర్వేయర్ దేవి, వీఆర్‌ఓలు షాజహాన్, రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.